క్లుప్తంగా

గోదావరి గట్టుపై రెయిలింగ్ ధ్వంసం



గోదావరి గట్టుపై రెయిలింగ్ ధ్వంసమైన దృశ్యం

నరసాపురం: పట్టణంలో గోదావరి గట్టు వెంబడి పాలరాయితో నిర్మించిన రెయిలింగ్ ధ్వంసమైంది. 2015 గోదావరి పుష్కరాల సమయంలో ఈ రెయిలింగ్‌ను గట్టు వెంబడి నిర్మించారు. అయితే పర్యవేక్షణ లేకపోవడంతో రెయిలింగ్ ధ్వంసమైంది. గట్టు వెంబడి నిర్మించిన ఫుట్‌పాత్ కూడా ధ్వంసమైంది. కొంతమేర రెయిలింగ్ చోరీకి కూడా గురవుతుంది. దీంతో అటుగా వెళ్లేవారు ఇబ్బందులు పడుతున్నారు. రెయిలింగ్ ధ్వంసంపై మున్సిపల్ అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

కవితల పోటీల్లో విజేతగా బాలచందర్



బాలచందర్

పెనుగొండ: తెలుగు భాషాభ్యున్నతికి అవిరళ కృషి చేస్తున్న సాహిత్య సంస్థ అక్షర శిల్పం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పుట్టినిల్లు మెట్టినిల్లు అంశంపై పెనుగొండ ఎస్వీకేపీ అండ్ పితాని వెంకన్న జూనియర్ కళాశాల తెలుగు విభాగాధిపతి డాక్టర బాలచందర్ సాదే రాసిన కవిత ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ మేరకు బుధవారం పెనుగొండలో విలేకరులకు వివరాలను తెలిపారు. సంస్థ అధ్యక్షుడు లక్ష్మీ నరసింహ గౌడ్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీ సామవేదం తన కవితను ఉత్తమ కవితగా ప్రకటించారన్నారు. ఉత్తమ విజేతగా నిలిచిన డాక్టర్ బాలచందర్‌ను ఎస్వీకేపీ పాలకవర్గ అధ్యక్షుడు పితాని సూర్యనారాయణ, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కె.రామచంద్రరాజు, కోశాధికారి ఉద్దగిరి లవకుమార్, ప్రిన్సిపాల్ కేవీఆర్ సూర్యనారాయణ, విశ్రాంత ఆచార్యులు మేడిపల్లి వికుమార్, రంకిరెడ్డి రామ్మోహనరావు తదితరులు అభినందించారు.

నేడు నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ఉండి: స్థానిక లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం గురువారం కూనపరాజు అప్పలరాజు సీతమ్మ లయన్స్ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్లు ప్రస్తుత అధ్యక్ష కార్యదర్శులు వేగేశ్న అనంతలక్ష్మి, కన్నెగంటి రూత్‌కళ తెలిపారు. ముఖ్య అతిథులుగా పి.సుభాష్ బాబు, ఈపూరి సత్యనారాయణ, సీహెచ్.కృష్ణంరాజు, గొంట్ల కృష్ణమూర్తి, పి.రామమూర్తి హాజరవుతున్నట్లు తెలిపారు. 2024–25 సంవత్సరానికి గాను నూతన కార్యవర్గ అధ్యక్ష, కార్యదర్శులు సత్తి బ్రహ్మారెడ్డి, ముదునూరి శివరామరాజు, ఉపాధ్యక్షులు గాదిరాజు రంగరాజు, ద్వారంపూడి నారాయణ రెడ్డి, కోశాధికారి పి.నర్సింగరావు, క్లబ్ ఎల్‌సీఐఎఫ్ కోఆర్డినేటర్ సాగిరాజు సాంబశివరాజు, తదితరులు ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపారు.

పంచాయతీ కార్యదర్శుల నూతన కమిటీ ఎన్నిక

కాళ్ల: మండలంలోని పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కమిటీ ఎన్నిక బుధవారం నిర్వహించారు. ఈవోపీఆర్‌డీ భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా కాళ్లకూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి డి.సునీల్‌రాజ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా బి.సతీష్ కుమార్, కార్యదర్శిగా సీహెచ్.సుజాత, కోశాధికారిగా బి.ఏసుబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి మండల కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

నేడు అల్లూరి శత వర్ధంతి సభ

పాలకోడేరు: తెల్ల దొరల గుండెల్లో నిదురించిన విప్లవ సింహం అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి సభను జయప్రదం చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ జిల్లా కార్యదర్శి ఎస్.మోహన్ కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. యావత్ దేశ ప్రజలకు విప్లవ జ్వాల రగిలించి, మన్యంలో గిరిజనులకు అండగా నిలిచి, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాడి 27 సంవత్సరాలకే వీర మరణం పొందిన అల్లూరి సీతారామరాజు మన జిల్లా వాడు కావడం మన అదృష్టమని పేర్కొన్నారు. ఆయన మరణించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా గురువారం భీమవరంలోని ఐఎంఏ హాల్‌లో పీడీఎస్‌వో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శత వర్ధంతి సభకు అందరూ హాజరు కావాలని మోహన్ కోరారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

భీమవరం: పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం పోషణ్ మధ్యాహ్న భోజన పథకంలో అవకతవకలు ఉండకూడదని, మధ్యాహ్న భోజన, పారిశుద్ధ్య జిల్లా కోఆర్డినేటర్స్ కె.కృష్ణారావు, జి.చిన్నయ్య అన్నారు. బుధవారం పట్టణంలోని ఝాన్సీలక్ష్మీబాయి(జేఎల్‌బీ) మున్సిపల్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంట గదిలోని బియ్యం, గుడ్లు, చిక్కీల నిల్వలను పరిశీలించారు అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పాలకొల్లులో తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేస్తున్న ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు



ఆచంటలో తహసీల్దారుకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు



పెనుమంట్రలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: దేశవ్యాప్తంగా పని చేస్తున్న కార్మికవర్గాల సమస్యలు తక్షణం పరిష్కరించాలని కోరుతూ కార్మికుల కోర్కెల దినం సందర్భంగా ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చింతపల్లి లక్ష్మి మాట్లాడుతూ ఆశ వర్కర్స్‌కి కనీస వేతనం చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇన్సూరెన్స్, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ అందించాలని, అలాగే ఆశ వర్కర్లపై అధికారుల వేధింపులు, తొలగింపులు అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు జవ్వాది శ్రీనివాసరావు, అంగన్‌వాడీ వర్కర్స్ దేవి, షేక్ బీబీ, నాగలక్ష్మి, శ్రీదేవి, రూతమ్మ, ఆశ వర్కర్లు బి.జానకి, ఎన్.నాగదుర్గ, డి.మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఐక్యంగా పోరాడాలి

పెనుగొండ: దేశ సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతూ కార్మిక హక్కులను కాలరాస్తోన్న కేంద్రంలోని కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మికులు ఐక్యంగా పోరాడాలని సీఐటీయూ ఆచంట మండల అధ్యక్షురాలు వైట్ల ఉషారాణి, ఆశా వర్కర్ల సంఘం మండల కార్యదర్శి నక్కా శైలజ పిలుపు నిచ్చారు. బుధవారం కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్త కార్మికుల డిమాండ్స్ డే సందర్భంగా ఆచంట తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి, తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రమాదకరమైన లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చి కార్మికుల పొట్టకొడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీఎస్ శర్మ, భవన నిర్మాణ కార్మిక సంఘ మండల కార్యదర్శి కేతా ఆంజనేయులు, అంగన్‌వాడీ మండల నాయకురాలు మైలే విజయలక్ష్మి, గుత్తుల శ్రీదేవి, జి.వెంకట రమణ, జి.నాగమణి, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు కె.పార్వతి, జి.గంగా భవాని, కె.హైమాభవాని తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

పెనుమంట్ర: కాంట్రాక్టు , ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ మండల కార్యదర్శి కోడె శ్రీనివాస ప్రసాద్ అన్నారు. బుధవారం దేశ వ్యాప్త కార్మికుల కోర్కెల దినోత్సవం సందర్భంగా సీఐటీయూ ఆధ్వర్యంలో బ్రాహ్మణచెర్వు నుంచి పెనుమంట్ర తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని, ప్రైవేటీకరణ, జాతీయ నగదు బదిలీ పథకం నిలిపివేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాలకు చెందిన నాయకులు సరస్వతి, సాయి మహాలక్ష్మి, నాగమణి రాజ్యలక్ష్మి, భవాని, ప్రశాంత కుమారి, పార్వతి, మణికుమారి, పరమేశ్వరి, బి.నాగేశ్వరరావు, ఏడుకొండలు, భాస్కరరావు, నాగేశ్వర రావు పాల్గొన్నారు.

పెనుగొండలో

పెనుగొండ: కార్మిక వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న కేంద్రం ప్రభుత్వానికి వ్యతిరేకంగా డిమాండ్స్ డే పురస్కరించుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో పెనుగొండ తహసీల్దారు కార్యాలయంవద్ద ధర్నా నిర్వహించి బుధవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల అధ్యక్షుడు నాగిశెట్టి గంగారావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు షేక్ పాదుషా, అంగన్‌వాడీ వర్కర్స్ నాయకురాలు కె.తులసి, ఐకేపీ వర్కర్స్ నాయకురాలు జి.లక్ష్మి, ఆశావర్కర్స్ నాయకురాలు కె.లక్ష్మి కుమారి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన తాగునీరు



మంచినీటి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నాయకర్

మొగల్తూరు: నియోజకవర్గంలో ప్రతి రోజూ సుమారు 18 లక్షల లీటర్ల శుద్ధి చేసిన తాగునీటిని అందిస్తున్నామని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ తెలిపారు. బుధవారం మొగల్తూరు గ్రామంలోని భారీ మంచినీటి చెరువును పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో అధ్వానంగా ఉన్న కోనాయికోడును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిప్పులేటి తారక రామారావు, కొల్లాటి గోపికృష్ణ, ముక్కు పుల్లయ్య, మెండు రాజేష లక్కు బాబి, లోకం నాని, తదితరులు పాల్గొన్నారు.

వరినాట్లు వేగంగా పూర్తి చేసుకోవాలి



కవిటంలో వరినాట్లను పరిశీలిస్తున్న పాలకొల్లు ఏడీఏ ఎ.పార్వతి, వ్యవసాయ శాఖ సిబ్బంది

పోడూరు: రైతులు వీలైనంత త్వరగా వరినాట్లు వేయడం పూర్తి చేయాలని పాలకొల్లు ఏడీఏ ఎ.పార్వతి సూచించారు. మండలంలోని కవిటం, తూర్పుపాలెం, పండితవిల్లూరు గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించారు. ఆయా గ్రామాల్లో నారుమడులను, వరినాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ రైతులకు పలు సూచనలు చేశారు. నారుమడుల్లో నారు తీయడానికి వారం రోజులు ముందు 3జీ కార్బోఫ్యూరాన్ గుళికలు 5 సెంట్ల విస్తీర్ణానికి 1 కేజీ చొప్పున చల్లాలన్నారు. నాట్లు వేసే సమయంలో తప్పనిసరిగా నారు చివరలను తుంచివేసి నాట్లు వేయాలనీ, దమ్ములో తప్పనిసరిగా బాస్వరం, పొటాష్ వేసుకోవాలనీ, నత్రజనిని బురదపదును మీద దఫదఫాలుగా వేయాలని సూచించారు. నీటి యాజమాన్యంపై ఏడీఏ రైతులకు పలు సూచనలు చేశారు. ఎక్కడైనా సాగునీటి సమస్య ఉంటే వ్యవసాయశాఖ సిబ్బంది దృష్టికి తీసుకురావాలని చెప్పారు. వీఏఏలు గ్రామాల్లో రైతులకు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ రైతుల సమస్యలేమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించేలా కృషి చేయాలన్నారు. కౌలురైతులు గుర్తింపు కార్డులు పొందేందుకు వీఆర్‌ఓ కార్యాలయాల్లో సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, ఏఈఓ ప్రియాంక, వీఏఏలు నరసింహమూర్తి, పి.ప్రభాకర్, రైతులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన మంచినీరు అందించాలని ఆందోళన



25వ వార్డులో ఆందోళన చేస్తున్న ప్రజలు

నరసాపురం: కుళాయిల ద్వారా స్వచ్ఛమైన మంచినీరు అందించాలని పట్టణంలోని 25వ వార్డు ప్రజలు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో వార్డు వాసులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కవురు పెద్దిరాజు మాట్లాడుతూ ఓ వైపు డయేరియా వంటి సీజనల్ వ్యాధులతో ప్రజలు అల్లాడుతుంటే మరోవైపు కుళాయిల ద్వారా మున్సిపాలిటీ మురుగునీరు సరఫరా చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. కలుషిత నీరు కారణంగా ప్రజలు అంటు వ్యాధులబారిన పడుతున్నారని వాపోయారు. 25వ వార్డు ఆదర్శ్ నగర్‌లో పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి స్వచ్ఛమైన మంచినీటి సరఫరాకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాలా జ్యోతి, కోడెల్లి ఎమేలియా, కొల్లాటి శ్యామల, మాదపాటి పద్మ పాల్గొన్నారు.

కోటేశ్వరరావు సేవలు చిరస్మరణీయం



దగ్గులూరులో మాట్లాడుతున్న సంఘ రాష్ట్ర కార్యదర్శి పి.బాలకృష్ణ

పాలకొల్లు అర్బన్: కామ్రేడ్ కోటేశ్వరరావు మరణం చేనేత కార్మిక ఉద్యమానికి తీరని లోటని, ఆయన సేవలు చిరస్మరణీయమని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పి బాలకృష్ణ అన్నారు. మండలంలోని దగ్గులూరులో అనారోగ్యంతో మృతి చెందిన కోటేశ్వరరావు సంస్మరణ సభ బల్ల వీరభద్రం అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. 50 సంవత్సరాలకు చేనేత కార్మికులకు పింఛన్ కోసం 15 సంవత్సరాల పాటు ప్రభుత్వాలతో చేసిన పోరాటంలో కోటేశ్వరావు ముఖ్య పాత్ర పోషించారని బాలకృష్ణ గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరామ్, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, ఎంపీటీసీ సభ్యుడు శాగ సత్యనారాయణ, మహిళా సంఘ కార్యదర్శి బాసిన శ్యామల, సీపీఎం మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్, కోనేటి బాలరాజు పాల్గొన్నారు.

డ్రెయినేజీలు అధ్వానం



లలితాంబ ఘాట్ రోడ్డు వద్ద డ్రెయినేజీ సిల్ట్ బయటే వదిలేసి దృశ్యం

నరసాపురం: పట్టణంలో పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలు అధ్వానంగా తయారయ్యాయి. ఓ వైపు డయేరియా లాంటి సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా పరిస్థితి ఈ రకంగా ఉండడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వేసవిలో మే నెల ముగిసిన తరువాత పట్టణంలో డ్రెయిన్స్‌లో సిల్ట్ తీత పనులు చేపట్టారు. అయితే పలు ప్రాంతాల్లో తీసిన సిల్ట్ అక్కడే పక్కన ఉంచేశారు. దీంతో వర్షాలు పడి పరిస్థితి దారుణంగా మారింది. కొన్ని ప్రాంతాల్లో డ్రెయిన్స్‌పై తీసిన మూతలు తిరిగి యథాస్థానంలో పెట్టలేదు. మరికొన్ని ప్రాంతాల్లో డ్రెయిన్స్ శుభ్రం చేసే పనులు చేపట్టలేదు. మున్సిపల్ అధికారులు ఇప్పటికైనా స్పందించి పరిస్థితి చక్కదిద్దాలని స్థానికులు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



పెనుగొండలో మండల పరిషత్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: వర్షాకాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ పుతినీడి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం పెనుగొండలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల పరిషత్ సాధారణ సమావేశంలో మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ఎప్పటికపుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అదే విధంగా తాగునీటిపై శ్రద్ధ వహించాలన్నారు. రోడ్లు, ఆరోగ్యం, రైతు సమస్యలు, పశు సంరక్షణ, డ్రెయినేజీ వ్యవస్థలపై ఆయా శాఖల అధికారులు నివేదిక సమర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన, తహసీల్దారు రోహిణీ దేవి, ఎంపీడీఓ సుండం శ్రీనివాస దొర తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ రామారావు స్ఫూర్తి ఆదర్శనీయం



ఈది రామారావు స్మారక స్థూపాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న దృశ్యం

పోడూరు: పోడూరు గ్రామానికి చెందిన కామ్రేడ్ ఈది రామారావు (స్టీఫెన్) ఉద్యమస్ఫూర్తి ఆదర్శనీయమని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మంతెన సీతారాం అన్నారు. పోడూరులో సంతమార్కెట్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన కామ్రేడ్ ఈది రామారావు స్మారక స్థూపాన్ని బుధవారం ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఆవిష్కరించారు. స్థూపంపై జెండాను సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఎగురవేశారు. అనంతరం సీతారాం, బలరాం, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఈది రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల అధ్యక్షుడు పిల్లి ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్, కేతా గోపాలన్, సర్పంచ్ శెట్టిబత్తుల సువర్ణరాజు, మూడే మోజెస్, బొంతు శ్రీనివాస్, బూరాబత్తుల వెంకట్రావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు 33/11కేవీ సబ్ స్టేషన్‌లో 11కేవీ వెలివెల ఫీడర్ పరిధిలోని ప్రాంతాల్లో గురువారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నరసాపురం సబ్ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.సురేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటనలో విడుదల చేశారు. ఓఎన్‌జీసీ నిర్మిస్తున్న వాల్వ్ స్టేషన్‌కి కొత్త విద్యుత్ స్తంబాలు వేస్తున్న కారణంగా దగ్గులూరు, బల్లిపాడు, శివదేవునిచిక్కాల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

భీమవరం: వీరవాసరం మండలం మడుగుపోలవరం పంచాయతీ పరిధిలోని జొన్నలపాలెంలో రామాలయం పునర్నిర్మాణాన్ని అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కలెక్టర్ చదలవాడ నాగరాణికి బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఒబిలిశెట్టి శ్రీవెంకటేశ్వర్లు మాట్లాడుతూ జొన్నలపాలెంలో రామాలయ పునర్నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం రూ.10 లక్షల నిధులు మంజూరు చేయగా నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. అయితే గ్రామంలోని కొందరు అక్రమంగా రామాలయం స్థలంలోకి చొరబడి గుడి నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారన్నారు. గుడి నిర్మాణాన్ని అడ్డుకునే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో విశ్వ హిందూ పరిషత్ నాయకులు పల్లా సర్వారాయుడు, అఖిల్, గరికిముక్కు సుబ్బయ్య, తదితరులు ఉన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

కాళ్ల: ప్రతీ ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అడ్వకేట్‌లు తెలిపారు. మండల న్యాయ సేవాధికార సంస్థ, భీమవరం వారి ఆదేశాల మేరకు బుధవారం పెదఅమిరం గ్రామ సచివాలయం వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్యానల్ లాయర్స్ పులిదిండి అంబేద్కర్ మాట్లాడుతూ గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టం 1994ను వివరించారు. నార్కిమేల్లి సుధీర్ మాట్లాడుతూ మహిళా చట్టాలు, సామాజిక న్యాయం గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎస్.సుధీర్, పులిదిండి అంబేద్కర్, బి.సునీల్ కుమార్, సర్పంచ్ సోమేశ్వరరావు, వీఆర్వో హరి రామ్ కుమార్, ప్యారా లీగల్ వలంటీర్ శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి అండగా ఆర్థిక సాయం

పెనుగొండ: కిడ్నీ సమస్యతో ఇబ్బందులు పడుతున్న పోడూరు మండల జనసేన మాజీ అధ్యక్షుడు గుడాల రాజేష్‌కు పెనుగొండలో పల్లపు వీధియువత శ్రీరమసాయి యువజన సంఘం ద్వారా బుధవారం రూ.57,332 ఆర్థిక సహాయం అందించారు. మరింత మంది దాతలు అండగా నిలిచి రాజేష్ కిడ్నీ సమస్యల వైద్యానికి సహాయం చేయాలని దాతలు విజ్ఞప్తి చేశారు.

పెనుగొండ అభివృద్ధికి కృషి



పెనుగొండ పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: పెనుగొండ అభివృద్ధికి ప్రతిపాదనలు చేయనున్నట్లు సర్పంచ్ నక్కా శ్యామలాసోనీ శాస్త్రి తెలిపారు. బుధవారం పంచాయతీ సాధారణ సమావేశం నిర్వహించారు. 20 మంది సభ్యులకు 18 మంది హాజరుకాగా 31 తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ సహకారంతో అభివృద్ధి పనులకు నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పోడూరి గోవర్ధన, పంచాయతీ కార్యదర్శి టి.రత్నాకరరావు, డీఎం మహంతి, జి.భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మ శాశ్వత నిత్యాన్నదాన ప్రసాద వితరణకు పట్టణానికి చెందిన గొట్టుముక్కల సత్యనారాయణరాజు, శైలజ దంపతులు రూ.25 వేలు, గొట్టుముక్కల వెంకట పవన్ కుమార్, శ్వేత దంపతులు రూ.25 వేలు, భూపతిరాజు ఆనంద్ విజయ వర్మ, శ్రీలలిత రూ.25 వేలు, వేగేశ్న రాజంరాజు, లీలాకుమారి రూ.25 వేలు విరాళంగా అందజేశారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి, నగేష్ ప్రసాదాలు, శేష వస్త్రం, ఫోటో అందించారు.

ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం

వీరవాసరం: సమాజ సేవలో ప్రతీ ఒక్కరూ ముందుకు రావాలని ఏబీవీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ తోట సత్య కళ్యాణ్ కోరారు. ఏబీవీపీ (అఖిల భారత విద్యార్థి పరిషత్) 76వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని వీరవాసరం శాఖ అధ్వర్యంలో బుధవారం పలు కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి విద్యతోపాటు దేశభక్తి కలిగి ఉండాలని కోరారు. విద్యార్థులతో కలిసి ఏబీవీపీ యొక్క ముఖ్య ఉద్దేశ్యం, విద్యార్థుల కోసం ఏబీవీపీ చేసిన ఉద్యమాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం పెద్ద ఎత్తున నిర్వహించారు.

పాము కాటుతో మృతి

పాలకోడేరు: పాము కాటుతో రైతు మృతి చెందిన ఘటన బుధవారం మండలంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం శృంగవృక్షంలోని చినపేటకు చెందిన దుండి లక్ష్మణరావు పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం పొలం వెళ్లగా అక్కడ పాము కాటు వేసింది. స్థానికుల సహాయంతో కుటుంబ సభ్యులు దగ్గరలోని ఆసుపత్రికి తీసుకు వెళ్లిన కొద్దిసేపటికి లక్ష్మణరావు మృతి చెందాడు. మృతుడి కుమారుడు రాజారావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పాలకోడేరు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు.